# ఆంధ్రప్రదేశ్ అనుమతిదారుల పనుల నియమాలు, 2007

## ముందుమాట

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి జారీచేసే నిబంధనలు (రెగ్యులేషన్స్) అన్నింటినీ విద్యుత్ అధికారులకు మరియు విద్యుత్ వినియోగదారులకు పుస్తక రూపంలో అందించాలనే ఉద్దేశంతో, మండలి, ప్రతి నిబంధననూ ఇంగ్లీషులోను, తెలుగులోను జంటగా పుస్తక రూపంలో ఇంతకు ముందే ప్రచురించడం జరిగింది.

ప్రస్తుతం, విద్యుత్ చట్టాలననుసరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన నియమాలను (రూల్స్) కూడా తెలుగులో అందించాలనే ఉద్దేశంతో, ముందుగా విద్యుత్ వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమైన "ఆంధ్రప్రదేశ్ అనుమతిదారుల పనుల నియమాలు, 2007" (ఆంధ్రప్రదేశ్ వర్క్స్ ఆఫ్ లైసెన్సీస్ రూల్స్, 2007) అనే నియమాలను ఇంగ్లీషు, తెలుగు భాషలలో జంటగా పుస్తక రూపంలో ప్రచురించడమైనది. ఇది విద్యుత్ రంగంలో చేపట్టే పనుల కారణంగా సాధారణ ప్రజల ఆస్తులకు నష్టం జరిగే సందర్భంలో వారికి గల హక్కులను తెలియపరుస్తూ వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని "మండలి" భావిస్తున్నది.

**– ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి**

# ఆంధ్రప్రదేశ్ అనుమతిదారుల పనుల నియమాలు, 2007

## విషయ సూచిక


| క్ర.సం. | వివరణ | పేజి నం. |
| --- | --- | --- |
| 1. | ఆంధ్రప్రదేశ్ అనుమతిదారుల పనుల నియమాలు, 2007 | 21 |
| 2. | **అనుబంధము - 1**<br>ప్రసారణ లైన్లను వేయుటలో దారి హక్కుకు సంబంధించి జరిగిన నష్టములకు గాను నష్ట పరిహారమును చెల్లించుట కొరకు మార్గదర్శకములు | 31 |
| 3. | **అనుబంధము - 2**<br>వివిధ ఓల్టేజి లైన్ల కొరకు ఆర్ఓడబ్ల్యు వెడల్పు<br>(దారి హక్కు నడవ వెడల్పు) | 33 |
| 4. | **అనుబంధము - 3**<br>విద్యుత్ చట్టము, 2003 లో అనుమతిదారుల పనులకు సంబంధించిన పరిచ్ఛేధములు:<br>i) 67వ పరిచ్ఛేధము<br>ii) 68వ పరిచ్ఛేధము<br>iii) 69వ పరిచ్ఛేధము<br>iv) 164వ పరిచ్ఛేధము | 34 |

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

**సంక్షిప్తి**

విద్యుత్తు – విద్యుత్ చట్టం, 2003 – ఆంధ్రప్రదేశ్ అనుమతిదారుల పనుల నియమాలు, 2007 – జారీ.

---

ఇంధన (పిఆర్–II) శాఖ

జి.ఓ.ఎమ్.ఎస్.నం.24 తేదీ: 27.02.2007

1. జి.ఎస్.ఆర్.217 (ఇ), విద్యుత్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, తేదీ: 18.04.2006
2. చైర్‌పర్సన్ & మేనేజింగ్ డైరెక్టరు, ఏ.పి. ట్రాన్స్‌కో, హైదరాబాదు నుండి లేఖ నం.సిఇ (ఆర్ఎసి ఆఫ్ రిఫార్మ్స్) ఏఏఓ/ఇ.యాక్ట్–03/డి.నం.286/2006 తేదీ: 25.11.2006

---×---

**ఉత్తరువు:**

పైన తెలిపిన 1వ నిర్దేశములో, భారత ప్రభుత్వం, విద్యుత్ చట్టం, 2003 లోని పరిచ్ఛేధములు 176 (2) (ఇ) మరియు 67 (2) ప్రకారం అనుమతిదారుల పనుల నియమాలు, 2006 ను జారీ చేసింది.

పైన తెలిపిన రెండవ నిర్దేశంలో, చైర్‌పర్సన్ & మేనేజింగ్ డైరెక్టరు, ఏపిట్రాన్స్‌కో, హైదరాబాదు వారు అట్టి నియమాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వర్తించుట కొరకు ముసాయిదా నియమాలను పంపారు.

ప్రభుత్వం, సదరు నియమాలను జాగ్రత్తగా పరిశీలించిన మీదట భారత ప్రభుత్వం జారీ చేసిన నియమాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొరకు అవే మాదిరి నియమాలను జారీ చేయాలని నిర్ణయించింది.

కేంద్ర విద్యుత్ చట్టము, 2003 (2003 లోని 36వ చట్టము) లోని పరిచ్ఛేధములు 180 (2) (బి) మరియు 67 (2) ల ద్వారా లభించిన అధికారములను వినియోగిస్తూ ఆంధ్రప్రదేశ్ గవర్నరు ఈ క్రింది నియమాలను జారీచేయడమైనది:

## నియమాలు

**1. సంగ్రహ నామము, ప్రారంభము:**

(1) ఈ నియమములను ఆంధ్రప్రదేశ్ అనుమతిదారుల పనుల నియమాలు, 2007 అని పేర్కొనవచ్చును.

(2) ఇవి ప్రభుత్వ అధికారిక రాజపత్రములో ప్రచురించబడిన తేదీ నుండి అమలులోనికి వచ్చును.

**2. నిర్వచనములు:**

(1) ఈ నియమాలలో సందర్భమును బట్టి వేరే అర్థము ఉన్ననే తప్ప,–

(ఏ) "చట్టము" అనగా విద్యుత్ చట్టము, 2003 అని అర్థము;

(బి) "ఏదేని భవనము లేక భూమి యొక్క స్వాధీనదారు" అనగా ఆ భవనమును లేక భూమిని న్యాయ సమ్మతముగా స్వాధీనమునందు కలిగియున్న వ్యక్తి అని అర్థము;

(సి) "రాష్ట్ర ప్రభుత్వము" అనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము అని అర్థము;

(డి) "మండలి" అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అని అర్థము.

(2) ఈ నియమములలో ఉపయోగించబడి, నిర్వచించబడని పదములు మరియు పదబంధములు చట్టములో వాటికి ఉన్న అర్థములనే కలిగియుండును.

**3. అనుమతిదారుడు పనులను చేయుట:**

(1) అనుమతిదారుడు,-

(ఏ) అంతకు ముందు ఏదేని భవనములోగాని, ద్వారాగాని లేక ఎదుటగాని లేదా ఏదేని భూమి మీదగాని, పైనగాని లేక క్రిందగాని న్యాయ సమ్మతముగా ఏదేని విద్యుత్ సరఫరా లైనును వేయని యెడల లేక ఇతర పనులను చేయని యెడల, అనుమతిదారుడు, ఆ భవనము లేక భూమి యజమాని లేక స్వాధీనదారు యొక్క ముందస్తు అనుమతితో, ఆ భవనము లేక భూమిమీద, పైన లేక లోపల విద్యుత్ సరఫరా లైనును వేయవచ్చును లేక పనులను చేయ వచ్చును.

(బి) ఓవర్ హెడ్ లైనుకు ఆధారం గట్టిగా ఉండేందుకు ఏదేని భవనము లేక భూమి పైన ఓవర్ హెడ్ లైనుకు ఆధారమును లేక ఏదేని ఆధార తీగ లేక ఆధార స్తంభమును బిగించ వచ్చును లేక ఇంతకు ముందే బిగించబడి ఉన్నట్లయితే అట్టి ఆధారమును మార్చ వచ్చును.

(2) భవనము లేక భూమి యొక్క యజమాని లేక స్వాధీనదారు, ఈ నియమము ప్రకారం చేపట్టబడు పనులకు సంబంధించి అభ్యంతరములు తెలిపిన యెడల, ఆ పనులను చేపట్టుటకు గాను, అనుమతిదారుడు, జిల్లా మేజిస్ట్రేటు లేక పోలీసు కమీషనరు లేక ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంచే అధికారమీయబడిన ఇతర అధికారి నుండి వ్రాతపూర్వకమైన అనుమతిని పొందవలెను.

(3) పనులు చేయబడిన లేక ఓవర్ హెడ్ లైనుకు ఆధారము, ఆధార తీగ లేక ఆధార స్తంభం బిగించబడిన భవనము లేక భూమి యొక్క యజమాని లేక స్వాధీనదారు, ఎప్పుడైనను, తగిన కారణమును చూపిన యెడల, జిల్లా మేజిస్ట్రేటు లేక పోలీసు కమీషనరు లేక అధికారమీయబడిన అధికారి వ్రాతపూర్వకమైన ఉత్తరువు ద్వారా అట్టి పనులను, ఆధారమును, ఆధార తీగ లేక ఆధార స్తంభమును తొలగించవలసినదిగా లేక మార్పు చేయవలసినదిగా ఆదేశించవచ్చును.

(4) ఉప-నియమం (1) క్రింద ఉత్తరువును జారీ చేయునప్పుడు, జిల్లా మేజిస్ట్రేటు లేక సందర్భానుసారముగా, పోలీసు కమీషనరు లేక అధికారమీయబడిన అధికారి, సంబంధిత వ్యక్తుల వినతి పత్రములు ఏవేని ఉన్నయెడల వాటిని పరిశీలించిన మీదట, అతని అభిప్రాయములో అనుమతిదారుడు యజమానికి లేక స్వాధీనదారునికి చెల్లించవలసిన నష్టపరిహారమును లేక

వార్షిక అద్దెను నిర్ణయించవలెను.

(5) జిల్లా మేజిస్ట్రేటు లేక పోలీసు కమీషనరు లేక అధికారమీయబడిన అధికారి, ఉప-నియమం (1) క్రింద జారీ చేసిన ప్రతి ఉత్తరువు మండలి సమీక్షకు లోబడి యుండును.

(6) ఈ నియమములో ఉన్నదేదియూ, చట్టము యొక్క 164వ పరిచ్ఛేధము ప్రకారం అనుమతిదారునికి ఒసగబడిన అధికారములకు భంగము కలిగించదు.

**4. వీధులు, రైలు మార్గములు, ట్రామ్ మార్గములు, కాలువలు లేక జలమార్గములను ప్రభావితము చేయు పనులు:**

(1) ఏవేని పనులను చేయుటకు సంబంధించి అనుమతిదారుని అధికార వినియోగం వలన ఏదేని వీధి, వీధిలో భాగము, రైలు మార్గము, ట్రామ్ మార్గము, కాలువ లేక జలమార్గము లోపల, క్రింద, పైన, వెంబడి లేక అడ్డంగా ఏవేని పనులను చేయవలసి వచ్చినప్పుడు, అనుమతిదారుడు, సందర్భానుసారముగా, ఆ వీధి లేక అందలి భాగమునకు మరమ్మత్తుకు బాధ్యుడైన వ్యక్తికి (ఇందు, ఇటు పిమ్మట "మరమ్మత్తుల అధికారి" అని పేర్కొనబడును) లేక రైలు మార్గము, ట్రామ్ మార్గము, కాలువ లేక జలమార్గములలో పనులు చేయుటకు అప్పటికి హక్కు కలిగి యున్న వ్యక్తికి (ఇందు, ఇటు పిమ్మట "పనుల అధికారి" అని పేర్కొనబడును) అట్టి పనులను ప్రారంభించుటకు 15 రోజుల ముందుగా వ్రాతపూర్వకమైన నోటీసును ఈయవలెను. ఆ నోటీసులో ప్రతిపాదిత పనులను వివరిస్తూ, అట్టి పనుల వివరములను స్పష్టంగా చూపుటకు తగినంత స్కేలు ప్రకారం సెక్షనును మరియు ప్లానును జతపరచవలెను. అట్టి స్కేలు ఎట్టి పరిస్థితులలోనూ, నిలువుగా అంగుళానికి ఎనిమిది అడుగులు మరియు అడ్డంగా 16 అంగుళాలకు ఒక మైలుకు తగ్గకుండా ఉండవలెను. ఏ రీతిలో, ఏ సమయంలో పనులను చేయుటకు ప్రతిపాదించబడినది లేక ప్రస్తుతం ఉన్న పనులను మార్చదలచినదీ తెలుపవలెను. ఆ విధంగా చేయుటకు మరమ్మత్తుల అధికారి లేక సందర్భానుసారంగా, పనుల అధికారి కోరిన మీదట, దానికి సంబంధించి ఎప్పటికప్పుడు కోరిన విధంగా తదుపరి సమాచారమును అందజేయవలెను.

(2) మరమ్మత్తుల అధికారి తగిన కారణములను తెలుపుతూ అట్టి పనులను, సెక్షనును లేక ప్లానును తాను ఆమోదించుట లేదని గాని లేక సవరణకు లోబడి ఆమోదించుచున్నట్లు గాని అనుమతిదారునికి సమాచారమును అందించిన యెడల, ఆ విషయం ఒప్పందము ద్వారా పరిష్కరించబడనట్లయితే, అనుమతిదారుడు, అట్టి సమాచారము అందిన వారము రోజుల లోపల మండలికి అప్పీలు చేసుకొనవచ్చును. మరమ్మత్తుల అధికారి తన చర్యకు సంబంధించి తెలిపిన కారణములను మండలి పరిశీలించిన మీదట మండలి చేసే నిర్ణయము అంతిమమై యుండును.

(3) మరమ్మత్తుల అధికారి, నోటీసు అందిన 15 రోజుల లోపల తాను ఆమోదిస్తున్నదీ, లేనిదీ అనుమతిదారునికి వ్రాతపూర్వకముగా తెలియపరచని యెడల, పనులు, సెక్షను మరియు ప్లాను ఆమోదించబడినట్లుగా భావించబడును. అనుమతిదారుడు, మరమ్మత్తుల అధికారికి వ్రాతపూర్వకముగా 48 గంటలకు తక్కువకాని నోటీసును ఇచ్చిన మీదట, ఉప-నియమము (1) క్రింద అందజేసిన నోటీసు మరియు సెక్షను మరియు ప్లాను ప్రకారం పనులను చేయుటకు ఉపక్రమించవచ్చును.

(4) పనుల అధికారి, తగిన కారణములను తెలుపుతూ అట్టి పనులను, సెక్షనును లేక ప్లానును ఆమోదించని యెడల లేక సవరణకు లోబడి ఆమోదించినయెడల, 5వ నియమములోని ఉప-నియమం (1) ప్రకారం నోటీసు అందిన 15 రోజుల లోపల అనుమతిదారునికి ఒక వ్రాతపూర్వకమైన అభ్యర్థనను అందజేయవచ్చును. అట్టి అభ్యర్థనలో పనులకు లేక నష్టపరిహారమునకు సంబంధించిన లేక ఈ విషయంలో ఇతరుల పట్ల పనుల అధికారికి ఉన్న బాధ్యతలకు సంబంధించిన ఏ విషయమైననూ, ఒప్పందము ద్వారా పరిష్కరించబడని యెడల, మండలిచే నిర్ధారించబడవలెనని కోరవచ్చును.

(5) ఉప-నియమం (4) లో తెలుపబడిన సమయం లోపల పనుల అధికారి, అనుమతిదారునికి ఏవిధమైన అభ్యర్థనను అందజేయని సందర్భంలో, పనుల అధికారి ఆ పనులను, సెక్షనును మరియు ప్లానును ఆమోదించినట్లుగా భావించబడును. అట్టి సందర్భంలో లేక మండలిచే ఈ విషయం నిర్ధారించబడిన తరువాత, నష్టపరిహారము చెల్లించిన మీదట లేక నష్టపరిహారమును భద్రపరచిన మీదట, మండలి నిర్ధారించునట్టి లేక కక్షిదారుల మధ్య అంగీకరించబడినట్టి మార్పులకు లోబడి, నోటీసు మరియు సెక్షను మరియు ప్లాను ప్రకారం పనులను చేయవచ్చును:

**వివరణ:** రైలు మార్గములో, క్రింద, పైన లేక మీదుగా ఉన్న సర్వీసు లైను, పంపిణి మెయినుకు వెంటనే కలుపబడిన యెడల లేక వెంటనే కలుపబడుటకు ఉద్దేశించబడిన యెడల ఉప-నియమాలు (1) నుండి (5) లో "పనులు" అన్న పదములో చేరియుండును. అయితే, ప్రస్తుత స్వభావము లేక స్థితిని మార్చకూడని మరమ్మత్తు, పునరుద్ధరణ లేక మార్పులతో కూడిన పనులు లేక పంపిణీ మెయినుకు కలుపబడిన లేక కలుపుటకు ఉద్దేశించబడిన ఇతర సర్వీసు లైనులు ఈ 'పనులు' అన్న పదములో చేరియుండవు.

(6) పంపిణీ మెయినుకు వెను వెంటనే కలుపబడే లేక వెను వెంటనే కలుపుటకు ఉద్దేశించబడిన భూగర్భ సర్వీసు లైనును వేయుట, చేయు పనిలో భాగమైనప్పుడు అనుమతిదారుడు అట్టి పనులను నిర్వహించే తన ఉద్దేశ్యమును గురించి మరమ్మత్తుల అధికారికి లేక సందర్భానుసారంగా, పనుల అధికారికి 48 గంటలకు తక్కువకాకుండా వ్రాతపూర్వకమైన నోటీసును ఈయవలెను.

(7) ప్రస్తుత స్వభావమును, స్థితిని మార్చకుండా మరమ్మత్తు, పునరుద్ధరణ లేక మార్పులతో కూడిన పనులైనప్పుడు అనుమతిదారుడు, అత్యవసర పరిస్థితులలో తప్ప, మరమ్మత్తుల అధికారికి లేక సందర్భానుసారంగా పనుల అధికారికి, అట్టి పనులను నిర్వహించే తన ఉద్దేశ్యమును గురించి 48 గంటలకు తక్కువ కాకుండా వ్రాతపూర్వకమైన నోటీసును ఈయవలెను. అట్టి నోటీసు గడువు ముగిసిన మీదట, ఆ పనులను వెంటనే ప్రారంభించవలెను మరియు వీలైనంత వేగంగా చేయవలెను. వీలైనట్లయితే, పనులు పూర్తి అగువరకూ రాత్రింబగళ్ళు పనిచేయవలెను.

**5. అత్యవసర పరిస్థితులలో మరమ్మత్తులు, పనులు:**

(1) అనుమతిదారుడు, భూగర్భ విద్యుత్ సరఫరా లైనులో అంతరాయం ఏర్పడిన అత్యవసర పరిస్థితిలో, తాను చేపట్టదలచిన పనులను గురించి మరమ్మత్తుల అధికారికి లేక సందర్భానుసారంగా, పనుల అధికారికి తెలియపరచిన మీదట, 4వ నియమంలోని నిబంధనలను పాటించకుండగనే ఓవర్ హెడ్ లైనును వేయవచ్చును.

(2) అయితే అట్టి ఓవర్ హెడ్ లైనును భూగర్భ విద్యుత్ సరఫరా లైనులో లోపమును సరిచేయునంతవరకూ మాత్రమే ఉపయోగించవలెను. ఎటువంటి పరిస్థితులలోనూ, (సందర్భానుసారంగా, మరమ్మత్తుల అధికారి, పనుల అధికారి లేక స్వాధీనదారు యొక్క వ్రాతపూర్వకమైన అనుమతితో తప్ప) ఆరు వారములకు మించి ఉపయోగించరాదు మరియు లోపమును సరిచేసిన వెంటనే దానిని తొలగించవలెను.

**6. మురుగు కాలువలు, పైపులు లేక ఇతర విద్యుత్ లైన్లు లేక పనులకు చేరువలో ఇతర పనులను చేయు విధానము:**

(1) అనుమతిదారుడు లేక సందర్భానుసారంగా, తగు విధంగా అధికారం పొందిన వ్యక్తి (ఈ నియమంలో ఇటు పిమ్మట "నిర్వాహకుడు" గా పేర్కొనబడును),–

(ఏ) రాష్ట్ర ప్రభుత్వము యొక్క లేక ఏదేని స్థానిక ప్రాధికార సంస్థ యొక్క నియంత్రణలోని ఏదేని మురుగు కాలువ, డ్రెయిను, నీటి ప్రవాహమునకు లేక పనికి దగ్గరగా లేక తగిన అధికారమీయబడిన వ్యక్తిచే న్యాయ సమ్మతముగా వేయబడిన పైపు, సైఫను, విద్యుత్ సరఫరా లైనుకు లేక ఇతర పనికి దగ్గరగా అనుమతిదారుడు కొత్త విద్యుత్ సరఫరా లైన్లను వేయుట లేక ఇతర పనులను చేయుట కొరకు ఏదైనా కందకమును త్రవ్వవలసివచ్చినప్పుడు, లేక

(బి) అనుమతిదారుడు న్యాయ సమ్మతముగా వేసిన విద్యుత్ సరఫరా లైన్లు లేక పనులకు దగ్గరగా తగిన ప్రాధికారమీయబడిన వ్యక్తి కొత్త పైపులను వేయుట లేక ఇతర పనులను చేయుట కొరకు ఏదైనా కందకమును త్రవ్వవలసి వచ్చినప్పుడు;

సంబంధిత ఇరు పక్షాలు అంగీకరించిననే తప్ప, లేక అత్యవసర పరిస్థితిలో, రాష్ట్ర ప్రభుత్వమునకు లేక స్థానిక ప్రాధికార సంస్థకు లేక సందర్భానుసారంగా,

అధికారమీయబడిన వ్యక్తికి లేక అనుమతిదారునికి (ఈ నియమములో ఇటు పిమ్మట "యజమాని" గా పేర్కొనబడును) కందకము త్రవ్వుటను ప్రారంభించుటకు కనీసము 48 గంటలకు ముందుగా వ్రాతపూర్వకమైన నోటీసును ఈయవలెను. పని జరుగుతున్నప్పుడు అక్కడ ఉండుటకు యజమానికి హక్కు ఉండును మరియు యజమానికి సహేతుకమైన సంతృప్తి కలుగునట్లుగా సదరు పనిని నిర్వహించవలెను.

(2) నిర్వాహకుడు, పైపుకు, విద్యుత్ సరఫరా లైనుకు లేక పనికి స్థానచలనము లేకుండా వాటి అడుగు నుంచి పనిచేయవలెనని భావించినప్పుడు, ఆ పని చేయు సమయములో వాటికి తగిన ఆధారమును కల్పించవలెను. ఆ పని పూర్తి చేయు లోపు పనిచేసిన చోట అనువైన మరియు తగిన పునాదిని ఏర్పరచవలెను.

(3) నిర్వాహకుడు (అనుమతిదారుడు) విద్యుత్ సరఫరా లైనును తగిన అధికారము కలిగిన వ్యక్తికి చెందిన లేక చట్ట ప్రకారం విద్యుత్తును సరఫరా చేస్తున్న, ప్రసారణ చేస్తున్న లేక వినియోగించుచున్న వ్యక్తికి చెందిన ఏవేని పైపులు, లైన్లు లేక సర్వీసు పైపులు లేక సర్వీసు లైన్లకు అడ్డంగా లేక వాటికి తాకే విధంగా వేయునప్పుడు, అట్టి వ్యక్తి నుండి వ్రాతపూర్వకమైన అనుమతిని పొందిననే తప్ప మరియు చట్టములోని 53వ పరిచ్ఛేధములో నిర్దేశించిన భద్రతా నిబంధనల ప్రకారం తప్ప, అట్టి పైపులు, లైన్లు లేక సర్వీసు పైపులు లేక సర్వీసు లైన్లకు తాకే విధంగా సరఫరా లైన్లను వేయరాదు.

(4) నిర్వాహకుడు, ఈ నియమంలోని నిబంధనలను పాటించుటలో విఫలమైనప్పుడు, దాని మూలంగా జరిగిన నష్టానికి లేక హానికి పూర్తి నష్ట పరిహారమును చెల్లించవలెను.

(5) ఈ నియమం క్రింద ఏదేని విభేదము మరియు/లేక వివాదము ఏర్పడిన యెడల, ఈ విషయమును మండలి పరిష్కరించవలెను.

(6) అనుమతిదారుడు, ఒక స్థానిక ప్రాధికార సంస్థ అయిన సందర్భంలో, స్థానిక ప్రాధికార సంస్థకు మరియు దాని నియంత్రణలోని మురుగు కాలువలు, డ్రెయిన్లు, నీటి ప్రవాహములు లేక పనులకు సంబంధించి ఈ నియమములో తెలిపిన ప్రస్తావనలు వర్తించవు.

**7. పైపులు, విద్యుత్ లైన్లు మొదలైన వాటి స్థానములో మార్పు:**

(1) అనుమతిదారుడు, స్థానిక ప్రాధికార సంస్థ యొక్క ప్రధాన మురుగు కాలువలో భాగము కాని ఏదేని పైపును దాని స్థానము నుండి మార్చవచ్చును. ఏదేని స్థలము లోపల లేక పైన ఉన్న వైరును, తెరచుటకు లేక విడదీయుటకు అనుమతిదారుడు అధికారము కలిగి ఉన్నట్లయితే, చట్ట ప్రకారం అతని అధికారములను వినియోగించుటలో ఆటంకము కలిగించగల అట్టి పైపు లేక వైరును దాని స్థానము నుండి మార్చవచ్చును. పైన తెలిపినట్లుగా, అట్టి స్థలములోపల లేక పైన అనుమతిదారునికి చెందిన విద్యుత్ సరఫరా లైన్లను లేక పనులను, ఎవరేని వ్యక్తి, తనకు ఉన్న అధికారములను న్యాయబద్ధముగా వినియోగించుటకు అవి ఆటంకము కలిగించునప్పుడు,

వాటి స్థానమును మార్చవచ్చును.

(2) అనుమతిదారుడు గాని లేక ఇతర వ్యక్తిగాని మార్పు చేయదలచినప్పుడు పైపు లేక సందర్భానుసారంగా వైరు, విద్యుత్ సరఫరా లైన్లు లేక పనులపై ఆ సమయంలో హక్కు కలిగియున్న వ్యక్తికి (ఇటు పిమ్మట ఈ నియమంలో “యజమాని” గా పేర్కొనబడును), అతడు అంగీకరిస్తే తప్ప, అట్లు మార్పు చేయుటను ప్రారంభించుటకు ముందు, ప్రతిపాదిత మార్పును వివరిస్తూ నెల రోజులకు తక్కువ కాకుండా వ్రాతపూర్వకమైన నోటీసును అందజేయవలెను. ఆ నోటీసులో ప్రతిపాదించిన మార్పులను వివరిస్తూ ప్రతిపాదిత పనుల వివరములను స్పష్టంగా చూపుటకు తగినంత స్కేలు ప్రకారం సెక్షను మరియు ప్లానును జతపరచవలెను. తీసుకొన్న స్కేలు ఎట్టి పరిస్థితులలోనూ, నిలువుగా అంగుళానికి ఎనిమిది అడుగులు మరియు అడ్డంగా 16 అంగుళాలకు ఒక మైలుకు తగ్గకుండా ఉండవలెను. పనులను ప్రారంభించు సమయమును తెలుపవలెను. దానికి సంబంధించి యజమాని కోరిన విధంగా సమాచారమును తదుపరి కూడా అందించవలెను.

(3) యజమాని, నోటీసు, సెక్షను మరియు ప్లానును అందుకొన్న 14 రోజుల లోపల, నోటీసు, సెక్షను మరియు ప్లానుపై ఉత్పన్నమయ్యే వివాదమునకు సంబంధించి, ఆ వివాదము ఒప్పందము ద్వారా పరిష్కరింపబడని యెడల, అది మండలిచే నిర్ధారించబడవలెనని నిర్వాహకునికి వ్రాతపూర్వకమైన ఒక అభ్యర్థనను అందజేయవలెను. అటు పిమ్మట ఆ వివాదము మండలిచే నిర్ధారించబడవలెను.

(4) ఉప-నియమం (3) ప్రకారం వివాదం మండలికి పంపబడినప్పుడు, మండలి, యజమాని యొక్క కర్తవ్యములను, బాధ్యతలను గౌరవించి, వీలైనంతవరకూ ఇందులో అడ్డంకి ఏర్పడకుండా, తాత్కాలికమైన లేక ఇతర పనులను చేయవలసినదిగా నిర్వాహకుడిని కోరవచ్చును.

(5) ఉప-నియమం (3) ప్రకారం నిర్వాహకునికి గడువులోపల ఏవిధమైన వ్రాతపూర్వక అభ్యర్థన అందని యెడల లేక అట్టి అభ్యర్థన అంది ఆ విషయము ఒప్పందము ద్వారా పరిష్కరించబడిన యెడల లేక మండలిచే నిర్ధారించబడిన యెడల, అంగీకరించిన లేక మండలి నిర్ధారించిన నష్టపరిహారమును చెల్లించిన మీదట లేక చెల్లించుటకు భద్రత ఏర్పరచిన మీదట, నోటీసు, సెక్షను మరియు ప్లాను ప్రకారం మార్పును చేయవచ్చును. అయితే ఇది ఇరు పక్షాలు అంగీకరించిన లేక మండలి నిర్ధారించిన సవరణలకు లోబడి ఉండును.

(6) మార్పులను చేయదలచిన నిర్వాహకుడు, ఈ నిబంధనలను పాటించుటలో విఫలమైనప్పుడు, దాని మూలంగా జరిగిన నష్టము లేక హానికి పూర్తి నష్టపరిహారమును చెల్లించవలెను. అట్టి పరిహార మొత్తము విషయంలో ఏదేని విభేదము లేక వివాదము ఏర్పడిన యెడల, ఆ విషయమును మండలి నిర్ధారించవలెను.

(7) యజమాని లేక స్వాధీనదారు తానే కొన్ని పనులను చేయదలచినప్పుడు,-

(i) అతడు, పైపులు లేక వైర్ల మార్పును చేయుటకు హక్కు కలిగిన నిర్వాహకునికి అట్టి మార్పులను ప్రారంభించుటకు కనీసం పది రోజులు ముందుగా తానే ఆ మార్పును చేయదలచినట్లుగా వ్రాతపూర్వకంగా ఒక ప్రతిపాదనను అందజేయవలెను. మరియు అంగీకరించిన విధంగా లేక ఒప్పందమును వ్యతిరేకించిన సందర్భంలో మండలి నిర్ధారించిన విధంగా ఖర్చులను తిరిగి చెల్లించుటకు భద్రత కల్పించవలసినదిగా కూడా నిర్వాహకుని కోరవలెను;

(ii) ఖండము (i) ప్రకారం ప్రతిపాదనను నిర్వాహకునికి అందజేసినప్పుడు, అతడు, మార్పు చేయుటను ప్రారంభించుటకు కనీసం 48 గంటలకు ముందు ఖర్చుల చెల్లింపుకు తగిన భద్రతను కల్పించి, మార్పును ఎప్పుడు ప్రారంభించవలసినదీ మరియు ఏ రీతిలో దానిని చేయవలసినదీ తెలుపుతూ వ్రాతపూర్వకమైన నోటీసును యజమానికి అందజేయవలెను. అటుపిమ్మట యజమాని, నిర్వాహకుడు కోరిన విధంగా మార్పు చేయుటను నిర్వహించవచ్చును.

(iii) యజమాని అట్లు పాటించుటకు తిరస్కరించినప్పుడు, లేక ఖండము (ii) క్రింద అతనికి అందజేసిన నోటీసులో నిర్దేశించిన రీతిలోను మరియు అట్టి సమయంలోపల నోటీసును పాటించనప్పుడు, నిర్వాహకుడు తానే ఆ మార్పును అమలు చేయవచ్చును.

(iv) ఖండము (ii) క్రింద నిర్వాహకుడు అందజేసిన నోటీసును పాటించుటలో యజమానికి అయిన ఖర్చులను, యజమాని నిర్వాహకుని నుండి వసూలు చేయవచ్చును.

**8. రాష్ట్ర ప్రభుత్వము, అనుమతిదారుడు లేక స్థానిక ప్రాధికార సంస్థచే మరమ్మత్తు చేయబడని పనులు:**

(1) రాష్ట్ర ప్రభుత్వముచే గాని లేక స్థానిక ప్రాధికార సంస్థచే గాని మరమ్మత్తు చేయబడజాలని ఏదేని వీధిని, వీధిని మరమ్మత్తు చేయవలసిన వ్యక్తి యొక్క లేక రాష్ట్ర ప్రభుత్వము యొక్క వ్రాతపూర్వకమైన ఆమోదముతో మాత్రమే అనుమతిదారుడు ఆ వీధిని విడగొట్టవచ్చును లేక విచ్ఛిన్నం చేయవచ్చును.

(2) రాష్ట్ర ప్రభుత్వము ఆదేశించిన విధంగా ప్రకటన ద్వారా లేక ఇతర విధంగా మరియు ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయించునట్టి వ్యవధి లోపల పైన పేర్కొన్న వ్యక్తికి అనుమతిదారుడు నోటీసును ఇచ్చి, నోటీసును అనుసరించి అందిన అన్ని అభ్యంతరములను, విన్నపములను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించునంతవరకూ రాష్ట్ర ప్రభుత్వం పైన తెలిపిన ఆమోదమును ఈయరాదు.

**9. కంచె వేయుట, రక్షణ కల్పించుట, దీపాలను అమర్చుట మరియు పనులకు సంబంధించిన ఇతర భద్రతా చర్యల కొరకు కార్య విధానము మరియు వీధులను, రైలు మార్గములను, మురుగు కాలువలను లేక సొరంగములను వెంటనే యథాస్థితికి తెచ్చుట:**

(1) ఈ నియమాల ప్రకారం లభించిన అధికారములను వినియోగిస్తూ ఎవరేని వ్యక్తి, వీధి, రైలు మార్గము లేక ట్రామ్ మార్గము లేక ఏదేని మురుగు కాలువ, డ్రెయిను లేక సొరంగమునకు చెందిన మట్టిని త్రవ్వుట గాని, కాలిబాటను విడగొట్టుట గాని చేసినప్పుడు, ఆ వ్యక్తి,–

(ఏ) తెరచిన లేక విడదీసిన భాగమునకు వెంటనే కంచె వేయుట మరియు రక్షణ కల్పించుట మరియు దారిన పోవు వారి కొరకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయుట చేయవలెను;

(బి) తెరచిన, త్రవ్విన లేక విడగొట్టిన భాగము వద్ద ప్రయాణీకులను హెచ్చరించుటకు గాను సూర్యాస్తమయమునకు ముందునుండీ తగినన్ని దీపములను ఏర్పాటు చేసి అవి సూర్యోదయం వరకూ వెలిగేలా చూడవలెను.

(సి) రాకపోకలు సజావుగా జరిగే విధంగా తగిన ఏర్పాట్లు చేయవలెను.

(డి) త్రవ్విన నేలను పూడ్చవలెను. విడగొట్టిన లేక విచ్ఛిన్నం చేసిన నేలను, కాలిబాటను, మురుగు కాలువను, డ్రెయిను లేక సొరంగమును త్వరగా యథాస్థితికి తీసుకొనిరావలెను. అట్లు తెరచుట మూలంగా లేక విడగొట్టుట మూలంగా ఏర్పడిన చెత్తాచెదారమును తొలగించవలెను.

(ఇ) మట్టిని లేక కాలిబాటను లేక తెరచిన లేక విడగొట్టిన మురుగు కాలువ, డ్రెయిను లేక సొరంగమును యథాస్థితికి తెచ్చి ఉపయోగమునకు అందుబాటులోనికి తెచ్చిన మీదట, దానిని మూడు నెలల వరకూ గాని, తొమ్మిది నెలలకు మించని మరికొంత కాలము వరకూ గాని, ఆ స్థలము స్థిరపడే వరకూ మంచి స్థితిలో ఉంచవలెను.

(2) ఉప-నియమం (1) లోని నిబంధనలను పాటించుటలో ఎవరేని వ్యక్తి  నిర్లక్ష్యము వహించిన యెడల, వీధి, రైలు మార్గము, ట్రామ్ మార్గము, మురుగు కాలువ, డ్రెయిను లేక సొరంగము దేనికి సంబంధించి నిర్లక్ష్యము జరిగినదో, దానిపై నియంత్రణ లేక యాజమాన్యము కలిగి యున్న వ్యక్తి అట్టి ఆలస్యము జరిగిన లేక చేయుట వదిలివేసిన పనిని నిర్వహించి, అందుకు అయిన ఖర్చును అట్లు నిర్లక్ష్యము వహించిన వ్యక్తి నుండి వసూలు చేయవచ్చును.

(3) ఉప-నియమం (2) క్రింద అయిన ఖర్చుల మొత్తమునకు సంబంధించి విభేదము మరియు/ లేక వివాదం ఏర్పడినప్పుడు, ఆ విషయము మండలిచే నిర్ధారించబడవలెను.

**10. అట్టి పనుల వలన ప్రజలకు కలిగే ఇబ్బందిని, పర్యావరణ హానిని మరియు ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆస్తులకు జరిగే అనవసరమైన నష్టాన్ని తప్పించుట:**

అనుమతిదారుడు, పనులను చేయు చున్నప్పుడు అట్టి పనుల కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందిని, పర్యావరణానికి జరిగే హానిని మరియు ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆస్తులకు అనవసరంగా జరిగే నష్టాన్ని కలుగకుండా చూడవలెను.

**11. రైలు మార్గములు, ట్రామ్ మార్గములు, జలమార్గములు మొదలైనవాటిని పునరుద్ధరించుటకు సొమ్మును డిపాజిటు చేయు పద్ధతి:**

అనుమతిదారుడు, రైల్వే మార్గములు, ట్రామ్ మార్గములు, జలమార్గములు మొదలైనవాటిని పునరుద్ధరించుట కొరకు ఈ నియమముల ప్రకారం మొత్తమును డిమాండు డ్రాఫ్టు రూపంలో సంబంధిత పనులను చేయుటకు బాధ్యుడైన అధికారి పేరున డిపాజిటు చేయవలెను.

**12. అట్టి పనుల కారణంగా నష్టం జరిగిన ఆస్తిని పునరుద్ధరించు పద్ధతి మరియు దాని నిర్వహణ:**
అనుమతిదారుడు, పనుల వలన నష్టం జరిగిన ఆస్తిని పునరుద్దరించి, ఒక నెల వరకూ దానికి అవసరమైన నిర్వహణను చూడవలెను.

**13. హాని జరిగిన వ్యక్తులకు నష్టపరిహారమును నిర్ధారించుట మరియు చెల్లింపు:**

(1) అనుమతిదారుడు, ఈ నియమాల యొక్క నిబంధనలను పాటించుటలో తప్పు చేసిన యెడల, దాని కారణంగా జరిగిన ఏదేని నష్టము లేక హాని కొరకు పూర్తి నష్టపరిహారమును బాధితుడైన వ్యక్తికి చెల్లించవలెను. నష్టపరిహారము విషయంలో ఉభయ పక్షముల మధ్య పరస్పర అంగీకారము కుదరని యెడల, జిల్లా మేజిస్ట్రేటు లేక ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికార మిచ్చిన ఇతర అధికారి నష్టపరిహారమును నిర్ధారించవలెను.

(2) ఉప-నియమము (1) ప్రకారం నిర్ధారించబడిన పరిహార మొత్తం విషయంలో విభేదము మరియు/ లేక వివాదము ఏర్పడిన సందర్భంలో, ఈ విషయాన్ని మండలి నిర్ధారించవలెను.

**14. అనుమతిదారుడు చెల్లించవలసిన నష్టపరిహారమును డిపాజిటు చేయుట కొరకు మరియు హామీని సమర్పించుట కొరకు కార్యవిధానము:**

(1) ఈ నియమముల ప్రకారం అనుమతిదారుడు చెల్లించవలసిన నష్టపరిహార మొత్తమును డిమాండు డ్రాఫ్టు రూపంలో డిపాజిటు చేయవలెను.

(2) ఈ నియమముల ప్రకారం సమర్పించవలసిన హామీ, షెడ్యూల్డు బ్యాంకు నుండి పొందిన బ్యాంకు గ్యారంటీ రూపంలో గాని లేక ఆయా సమయములందు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్టి ఏదేని ఇతర రూపంలోగాని ఉండవలెను.

**15. వివాదము మరియు/లేక విభేదమును మండలి నిర్ధారించుట:**
ఈ నియమాల ప్రకారం ఒక విషయము నిర్ధారణ కొరకు మండలి వద్దకు వచ్చినప్పుడు, మండలి, సంబంధిత కక్షిదారులను విచారించిన మీదట మరియు ముప్పది రోజుల లోపల ఆ విషయమును నిర్ధారించవలెను.

**16. నోటీసు, మొదలైన వాటిని అందజేయుట:**
ఈ నియమముల ప్రకారం ఒక వ్యక్తికి నోటీసును లేక సమాచారమును అందజేయవలసియున్నప్పుడు, చట్టము యొక్క 171వ పరిచ్ఛేధములోనూ మరియు దాని క్రింద చేసిన నియమాలలోనూ తెలిపిన కార్యవిధానమును అనుసరించవలెను.

(ఆంధ్రప్రదేశ్ గవర్నరుగారి ఉత్తరువు మేరకు మరియు వారి పేరున జారీ చేయబడినది)

ఎ.కె. గోయల్
ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

# అనుబంధము - 1

## సంఖ్య. 3/7/2015-ట్రాన్స్

## భారత ప్రభుత్వము

## ఇంధన మంత్రిత్వశాఖ

## శ్రమశక్తి భవన్

## రఫీమార్గ్, కొత్త ఢిల్లీ - 110 001

తేదీ: అక్టోబరు 15, 2015

విషయం: ప్రసారణ లైన్లను వేయుటలో దారి హక్కుకు సంబంధించి జరిగిన నష్టములకు గాను నష్ట పరిహారమును చెల్లించుట కొరకు మార్గదర్శకములు.

-----×----

రాష్ట్రాలకు/కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన విద్యుత్‌శాఖ మంత్రులతో గౌహతీలో ది.09.04.2015 నుండి 10.04.2015 వరకూ జరిగిన సమావేశంలో, దేశంలో ప్రసారణ లైన్లను వేయుటలో దారి హక్కుకు సంబంధించిన అంశములను విశ్లేషించుటకు మరియు ఈ విషయంలో నష్ట పరిహారమును చెల్లించుటకు ఒకే విధమైన పద్ధతిని సూచించుట కొరకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించడమైనది. తదుపరి, వివిధ రాష్ట్ర ప్రభుత్వములు మరియు ఇతరుల నుండి ప్రతినిధులతో కూడిన ఒక కమిటీని మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడమైనది. సదరు కమిటీ, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను తెలుసుకొనుటకుగాను అనేక సమావేశాలను నిర్వహించి తమ సిఫారసులతో పాటుగా ఒక నివేదికను సమర్పించింది.

2. కమిటీ చేసిన ఈ సిఫారసులను, విద్యుత్ చట్టము, 2003 లోని 67 మరియు 68వ పరిచ్ఛేధములలోను మరియు భారత టెలిగ్రాఫ్ చట్టము, 1885 లోని 10 మరియు 16వ పరిచ్ఛేధములలోను తెలిపినట్లుగా జరిగిన నష్టములకుగాను నష్ట పరిహారమును నిర్ధారించుట కొరకు ఈ క్రింద తెలిపినట్లు మార్గదర్శకములుగా రూపొందించడం జరిగింది. ఈ నష్ట పరిహారము, సాధారణంగా పంట నష్టాలకు మరియు చెట్ల నష్టాలకు చెల్లించే నష్ట పరిహారమునకు అదనము. ఈ మార్గదర్శకముల ప్రకారం, పరిహారం, 66 కెవి మరియు ఆపైస్థాయి టవరుపాదము ఉన్న ఆధారిత ప్రసారణ లైన్లకు మాత్రమే చెల్లించబడుతుంది. 66 కెవి కంటె క్రింది స్థాయి ఉప-ప్రసారణ మరియు పంపిణీ లైన్లకు పరిహారము చెల్లించబడదు:

(i) టవరు/పైలాన్ నిర్మాణము మూలంగా తీవ్రంగా నష్టం జరిగిన టవరుపాదము ఆక్రమించిన భూభాగము (నాలుగు స్తంభాల మధ్య ఉన్న భూమి) కొరకు సర్కిలు విలువ/మార్గదర్శకములలో తెలిపిన విలువ/స్టాంపు చట్టము క్రింద విలువ ఆధారంగా జిల్లా మేజిస్ట్రేటు లేక ఇతర అధికారి నిర్ధారించిన విధంగా భూమి విలువలో 85% నష్ట పరిహారం నిర్ధారించవలెను.

(ii) ప్రసారణ లైను వేసిన కారణంగా దారి హక్కు (ఆర్ఓడబ్ల్యు) నడవ (కారిడార్) యొక్క వెడల్పులోని భూమి విలువ తగ్గినందుకుగాను సర్కిలు విలువ/మార్గదర్శకాలలోని విలువ/స్టాంపు చట్టము క్రింద విలువ ఆధారంగా నిర్ధారించిన భూమి విలువలో 15% కంటె మించకుండా నష్ట పరిహారమును నిర్ధారించవలెను. ఈ విషయములో భూమి తరగతి/రకమును బట్టి రాష్ట్రములలోని వివిధ ప్రాంతములలో విధించవలసిన పరిమితులు ఆయా రాష్ట్రములచే నిర్ణయించబడును.

(iii) రాష్ట్ర ప్రభుత్వము యొక్క అభివృద్ధి హక్కుల బదిలీ (టిడిఆర్) విధానం క్రింద సంబంధిత నగరపాలక సంస్థ/పురపాలక సంస్థ, భూమి యజమాని/యజమానులకు ప్రతిపాదించిన/ అంగీకరించిన ప్రత్యామ్నాయ నష్ట పరిహార విధానం ప్రకారం, అనుమతిదారుడు/సంస్థ పైన (i) మరియు (ii) లలో తెలిపినట్లుగా నష్ట పరిహారమును సంబంధిత నగరపాలక సంస్థ/ పురపాలక సంస్థ/స్థానిక సంస్థ లేక రాష్ట్ర ప్రభుత్వము వద్ద జమచేయవలెను.

(iv) ఇందు నిమిత్తము, ఆర్ఓడబ్ల్యు కారిడార్ వెడల్పు అనుబంధము–2 లో నిర్దేశించిన దాని కంటె మించరాదు మరియు నేరుగా కండక్టర్లకు క్రింద ఉన్న వెడల్పు కంటె తక్కువ ఉండరాదు.

3. దీని ప్రకారం అవసరమైన చర్యను తీసుకొనగలరు. ఈ మార్గదర్శకములు ఆర్ఓడబ్ల్యు వివాదములను త్వరితంగా పరిష్కరించుటకు, రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాల మద్దతుతో ప్రసారణ లైన్లను పూర్తి చేయుటకు కూడా దోహదపడతాయి.

4. భూసేకరణ, రాష్ట్రాలకు సంబంధించిన విషయం కావున ఈ మార్గదర్శకములను అనుసరించుటకు సంబంధించి తగిన నిర్ణయం తీసుకొనవలసినదిగా అన్ని రాష్ట్రములను/కేంద్రపాలిత ప్రాంతములను కోరడమైనది.

**గమనిక: పై మార్గదర్శకములను రూపొందించిన సంఘమునకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము తెలియపరచిన అభిప్రాయములో టవరు బేస్‌కు నూటికి నూరు శాతము విలువను భూమి యజమానికి చెల్లించవలెనని, కాని దారి హక్కు నడవాకు ఎట్టి పరిహారమును చెల్లించకూడదని, 33 కెవిల సామర్థ్యము లేదా అంతకంటె తక్కువ సామర్థ్యపు లైన్లకు ఎట్టి నష్ట పరిహారమును చెల్లించకూడదని తెలియపరచడమైనది.**

## అనుబంధము-2

టవరు డిజైను, టవర్ల మధ్య దూరం, గాలివేగము, విద్యుత్ తీగల యొక్క గరిష్ట సాగుదల, దాని ఊపు వేగం మరియు ఇతర భద్రతా కొలమానాలను ఆధారంగా తీసుకొని ఆర్ఓడబ్ల్యు కారిడార్ యొక్క గరిష్ట వెడల్పును లెక్కించవలెను. ప్రామాణిక పరిస్థితులలో వివిధ ఓల్టేజిలకు ఆర్ఓడబ్ల్యు కారిడార్ (నడవా) వెడల్పు ఈ క్రింది విధంగా ఉండవలెను.

**వివిధ ఓల్టేజి లైన్ల కొరకు ఆర్ఓడబ్ల్యు వెడల్పు**

| ప్రసారణ ఓల్టేజి | ఆర్ఓడబ్ల్యు వెడల్పు (మీటర్లలో) |
|---|---|
| 66 కెవి | 18 |
| 110 కెవి | 22 |
| 132 కెవి | 27 |
| 220 కెవి | 35 |
| 400 కెవి ఎస్/సి | 46 |
| 400 కెవి డి/సి | 46 |
| +/- 500 కెవి హెచ్‌విడిసి | 52 |
| 765 కెవి ఎస్/సి (డెల్టా కాన్ఫిగరేషన్‌తో) | 64 |
| 765 కెవి డి/సి | 67 |
| +/- 800 కెవి హెచ్‌విడిసి | 69 |
| 1200 కెవి | 89 |

ఆర్ఓడబ్ల్యు యొక్క వెడల్పు, 05.05.2014 తేదీగల ఎమ్ఓఇఎఫ్ మార్గదర్శకాల ప్రకారం తెలుపబడినది.

# అనుబంధము - 3

**కేంద్ర విద్యుత్ చట్టము, 2003 లోని 67, 68, 69 మరియు 164వ పరిచ్ఛేధములు:**

**67. వీధులు, రైలు మార్గములు మొదలగు వాటిని విడగొట్టుటకు సంబంధించిన నిబంధన:**

(1) అనుమతిదారుడు, ఆయాసమయములందు, తన అనుమతిలోని నిబంధనలు మరియు షరతులకు లోబడి, తన సరఫరా లేక ప్రసారణ ప్రాంతములోపల లేదా అనుమతి షరతుల ద్వారా సరఫరా ప్రాంతము వెలుపల విద్యుత్ సరఫరా లైన్లను వేయుటకు అనుమతించబడినట్లయితే, సరఫరా ప్రాంతము వెలుపల ఈ క్రింద తెలిపిన పనులను చేయవచ్చును, అవేవనగా--

(ఏ) ఏదేని వీధి, రైలు మార్గము లేక ట్రామ్ మార్గమునకు చెందిన నేలను లేక కాలిబాటను విడగొట్టుట లేక విచ్ఛిన్నము చేయుట;

(బి) ఏదేని వీధి, రైలు మార్గము లేక ట్రామ్ మార్గములో లేక దాని క్రింద గల మురుగునీటి కాలువ, డ్రెయిను లేక సొరంగమును విడగొట్టుట లేక విచ్ఛిన్నము చేయుట;

(సి) ప్రధాన మురుగునీటి పైపు కాకుండా ఇతర లైను, పనులు లేక పైపులను వాటి స్థితి నుండి మార్చుట;

(డి) విద్యుత్ లైన్లు వేయుట, విద్యుత్ ప్లాంటు మరియు ఇతర పనులను చేయుట;

(ఇ) వాటిని మరమ్మత్తు చేయుట, మార్పు చేయుట లేక తొలగించుట;

(ఎఫ్) విద్యుత్ ప్రసారణ మరియు సరఫరా కొరకు అవసరమైన అన్ని ఇతర పనులను చేయుట.

(2) సంబంధిత ప్రభుత్వము, ఈ విషయంలో తాము చేయు నియమముల ద్వారా ఈ క్రింది వాటిని నిర్దేశించవలెను:-

(ఏ) పనులను చేయుటకు గాను, సందర్భానుసారముగా, సంబంధిత ప్రభుత్వము, స్థానిక ప్రాధికార సంస్థ, యజమాని లేక స్వాధీనదారు యొక్క వ్రాతపూర్వకమైన అనుమతి అవసరమైన సందర్భములు మరియు పరిస్థితులు;

(బి) యజమాని లేక స్వాధీనదారు అభ్యంతరము తెలిపిన సందర్భంలో పనులను చేయుటకై అనుమతిని మంజూరు చేయు అధికారి;

(సి) పనులను చేయుటకు ముందు అనుమతిదారుడు ఈయవలసిన నోటీసు యొక్క స్వభావము మరియు గడువు;

(డి) ఖండము (సి) లో పేర్కొన్న నోటీసు ననుసరించి అందిన అభ్యంతరములను మరియు సలహాలను పరిశీలించు ప్రక్రియ మరియు రీతి;

(ఇ) ఈ పరిచ్ఛేధము క్రింద పనుల వలన ప్రభావితులైన వ్యక్తులకు నష్ట పరిహారమును లేక అద్దెను నిర్ధారించుట మరియు చెల్లించుట;

(ఎఫ్) అత్యవసర పరిస్థితులలో చేపట్టవలసిన మరమ్మత్తులు మరియు పనులు;

(జి) ఈ పరిచ్ఛేధము ప్రకారం కొన్ని పనులను చేయుటకు యజమానికి లేక స్వాధీనదారుకు ఉన్న హక్కు మరియు వాటికైన ఖర్చుల చెల్లింపు;

(హెచ్) మురుగునీటి కాలువలు, పైపులు లేక ఇతర విద్యుత్ లైన్లు లేక పనుల వద్ద ఇతర పనులను చేపట్టు విధానము;

(ఐ) పైపులు, విద్యుత్ లైన్లు, విద్యుత్ ప్లాంటు, టెలిగ్రాఫు లైన్లు, మురుగునీటి లైన్లు, సొరంగాలు, డ్రెయిన్లు మొదలగు వాటి స్థానములలో మార్పు చేయుట కొరకు ప్రక్రియ;

(జె) కంచె వేయుట, రక్షణ కల్పించుట, దీపాలను అమర్చుట మరియు వీధులలో పనులకు రైలు మార్గములు, ట్రామ్ మార్గములు, మురుగు కాలువలు, డ్రెయిన్లు లేక సొరంగములకు సంబంధించిన ఇతర భద్రతా చర్యల కొరకైన ప్రక్రియ మరియు వాటిని వెంటనే పునరుద్ధరించుటకు ప్రక్రియ;

(కె) అట్టి పనుల వలన ప్రజల ఇబ్బందిని, పర్యావరణ హానిని మరియు ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆస్తులకు అనవసరంగా జరిగే నష్టాన్ని తప్పించుట;

(ఎల్) సంబంధిత ప్రభుత్వము, అనుమతిదారుడు లేక స్థానిక ప్రాధికార సంస్థచే మరమ్మత్తు చేయబడజాలని పనులను చేపట్టు విధానము;

(ఎమ్) రైలు మార్గములు, ట్రామ్ మార్గములు, జలమార్గములు మొదలైనవాటి పునరుద్ధరణ కొరకు అవసరమైన సొమ్మును డిపాజిటు చేయు పద్ధతి;

(ఎన్) అట్టి పనుల కారణంగా ప్రభావితమైన ఆస్తిని పునరుద్ధరించు పద్ధతి మరియు దాని నిర్వహణ;

(ఓ) అనుమతిదారుడు చెల్లించవలసిన నష్ట పరిహారమును డిపాజిటు చేయుట కొరకు మరియు హామీని సమర్పించుట కొరకు కార్యవిధానము;

(పి) ఈ పరిచ్ఛేధము ప్రకారం, నిర్మాణము మరియు పనుల నిర్వహణకు ఆనుషంగికమైన లేక పర్యవసానమైన ఇతర విషయములు.

(3) అనుమతిదారుడు, ఈ పరిచ్ఛేధము ద్వారా లేక దాని ప్రకారం మరియు ఈ పరిచ్ఛేధము క్రింద చేయబడిన నియమముల ద్వారా లభించిన అధికారములను వినియోగించునప్పుడు, వీలైనంతవరకూ తక్కువ హాని, నష్టము మరియు అసౌకర్యము జరుగునట్లు చూడవలెను. అతని వలన లేక అతనిచే నియమింపబడిన వారివలన జరిగిన ఏదేని హాని, నష్టము లేక అసౌకర్యమునకు గాను పూర్తి నష్ట పరిహారమును చెల్లించవలెను.

(4) ఉప-పరిచ్ఛేధము (3) ప్రకారం చెల్లించవలసిన నష్ట పరిహారంతో సహా, ఈ పరిచ్ఛేధము క్రింద ఏదేని విభేదము లేక వివాదము ఏర్పడిన యెడల, ఈ విషయమును సంబంధిత మండలి నిర్ధారించవలెను.

(5) సంబంధిత మండలి, ఈ పరిచ్ఛేధము క్రింద ఏర్పడిన ఏదేని విభేదము లేక వివాదమును నిర్ధారించునప్పుడు, ఉప–పరిచ్ఛేధము (3) ప్రకారం చెల్లించవలసిన నష్ట పరిహారమునకు అదనముగా అట్టి నష్ట పరిహారపు మొత్తమునకు మించకుండా జరిమానాను కూడా విధించవచ్చును.

**68. ఓవర్‌హెడ్‌లైన్లు:**

(1) సంబంధిత ప్రభుత్వ పూర్వానుమతితో, ఉప–పరిచ్ఛేధము (2) లోని నిబంధనల ప్రకారం ఓవర్ హెడ్ లైనును భూమికి పైన ఏర్పాటు చేయవలెను లేక ఏర్పాటు చేయునట్లు చూడవలెను.

(2) ఉప–పరిచ్ఛేధము (1) లోని నిబంధనలు ఈ క్రింది సందర్భములలో వర్తించవు,--

(ఏ) విద్యుత్ లైను యొక్క సాధారణ ఓల్టేజి 11 కిలోవోల్టులకు మించనప్పుడు మరియు ఆ లైను ఒకే వినియోగదారునికి వినియోగించునప్పుడు లేక వినియోగించుటకు ఉద్దేశింపబడినప్పుడు;

(బి) ఆ లైను వేయుటకు బాధ్యుడైన వ్యక్తి యొక్క స్వాధీనములో లేక నియంత్రణలో ఉన్న స్థలములోపల విద్యుత్ లైను ఉన్న లేక ఉండబోవు మేరకు; లేక

(సి) నిర్దేశించబడునట్టి ఇతర సందర్భములలో

(3) సంబంధిత ప్రభుత్వము, ఉప–పరిచ్ఛేధము (1) ప్రకారం అనుమతిని మంజూరు చేయునప్పుడు, లైనుపై యాజమాన్యము మరియు దాని నిర్వహణకు సంబంధించిన షరతులతో సహా, తాము అవసరమని భావించునట్టి షరతులను విధించవలెను.

(4) సంబంధిత ప్రభుత్వము, తమచే మంజూరు చేయబడిన అనుమతిలో నిర్ణయించిన గడువు ముగిసిన మీదట ఎప్పుడైననూ అనుమతిని మార్చవచ్చును లేక రద్దు చేయవచ్చును.

(5) ఓవర్ హెడ్ లైనుకు సమీపంలో ఏదేని చెట్టు ఉన్నప్పుడు లేక పడి ఉన్నప్పుడు లేక ఓవర్ హెడ్ లైనును వేసిన మీదట అట్టి లైనుకు సమీపంలో నిర్మాణము జరిగినప్పుడు లేక ఇతర వస్తువు పడి ఉన్నప్పుడు, మరియు అది విద్యుత్ ప్రసారణకు లేక ఏవేని పనులు చేయుటకు వీలు కాని విధంగా ఆటంక పరుచుచున్నప్పుడు లేక అడ్డంకిగా ఉన్నప్పుడు లేక దాని మూలంగా ఆటంకపరచు లేక అడ్డంకిగా ఉండే అవకాశము ఉన్నప్పుడు, సంబంధిత ప్రభుత్వముచే నిర్దేశించబడిన కార్యనిర్వాహక మేజిస్ట్రేటు లేక అధికారి, అనుమతిదారుడు దరఖాస్తు చేసిన మీదట, అట్టి చెట్టును, నిర్మాణమును లేక వస్తువును తొలగించునట్లుగా చూడవచ్చును లేక అతడు సబబని భావించు విధంగా ఇతర విధంగా దానిని పరిష్కరించ వచ్చును.

(6) ఉప–పరిచ్ఛేధము (5) ప్రకారం చేయబడిన దరఖాస్తును పరిష్కరించునప్పుడు, ఆ ఉప–పరిచ్ఛేధము క్రింద నిర్దేశించబడిన కార్యనిర్వాహక మేజిస్ట్రేటు లేక అధికారి, ఓవర్ హెడ్ లైనును వేయుటకు ముందునుండీ ఉన్నటువంటి చెట్టు విషయములో, ఆ చెట్టుపై హక్కు గల వ్యక్తికి, తాను సహేతుకమని భావించునట్టి నష్ట పరిహారమును మంజూరు చేస్తూ ఉత్తరువును చేయవచ్చును. మరియు అట్టి వ్యక్తి ఆ నష్ట పరిహారమును

అనుమతిదారుని నుండి వసూలు చేయవచ్చును.

**వివరణ:** ఈ పరిచ్ఛేధము నిమిత్తము "చెట్టు" అను పదబంధములో, ఏదేని పొద, కంచె, దట్టంగా పెరిగిన చెట్ల గుబురు, లేక ఇతర మొక్కలు చేరి యుండును.

**69. టెలిగ్రాఫ్ అధికారికి నోటీసు:**

(1) ప్రస్తుత స్వభావమును, స్థితిని మార్చే మరమ్మత్తు, పునరుద్ధరణ లేక మార్పులతో కూడిన పనుల కొరకైన సర్వీసు లైన్లు లేక విద్యుత్ లైన్లు లేక విద్యుత్ ప్లాంటు కాకుండా, ఏదేని టెలిగ్రాఫు లైనుకు పదిమీటర్ల లోపల, ఇతర విద్యుత్ లైనును వేయుటకు లేక విద్యుత్ ప్లాంటును నిర్మించుటకు లేక ఇతర పనులను చేయుటకు ముందుగా, అనుమతిదారుడు,

(ఏ) కొత్తగా చేపట్టబడుతున్న పనులను గురించి కేంద్ర ప్రభుత్వముచే నియమించబడు అధికారికి ఒక ప్రతిపాదనను సమర్పించవలెను. ఆ ప్రతిపాదనపై సదరు అధికారి ముప్పది రోజుల లోపల నిర్ణయము తీసుకొనవలెను;

(బి) ప్రస్తుత పనులలో మరమ్మత్తు, పునరుద్ధరణ లేక మార్పు వంటి వాటి విషయంలో వాటి వివరములను, అనగా,

(i) ప్రతిపాదించిన పనులు లేక మార్పులు చేయు విధానము;

(ii) ఆ పనులు ఉపయోగబడు రీతి;

(iii) ప్రసారణ చేయబడు విద్యుత్తు పరిమాణము మరియు స్వభావము;

(iv) ఎర్త్ రిటర్నులు ఉన్నట్లయితే ఎంతమేరకు, ఏ రీతిలో ఉపయోగించబడును;

అన్నది తెలియజేస్తూ, టెలిగ్రాఫ్ అధికారికి పది రోజులకు తక్కువ కాకుండా వ్రాతపూర్వకంగా ఒక నోటీసును ఈయవలెను. అట్టి పనులు లేక మార్పుల కారణంగా టెలిగ్రాఫు లైనుకు తీవ్రంగా నష్టం జరుగుటనుండి నివారించుటకై అనుమతిదారుడు టెలిగ్రాఫు అధికారి సాధారణంగా లేక ప్రత్యేకంగా సహేతుకంగా విధించిన విధంగా చేయవలసిన వాటిని అట్టి గడువు లోపల పాటించవలెను.

అయితే, ఏవేని విద్యుత్ లైన్లు లేక విద్యుత్ ప్లాంటు లేక అనుమతిదారుని యొక్క ఇతర పనులలో లోపం కారణంగా ఏర్పడిన అత్యవసర పరిస్థితులలో (అనుమతిదారుడు వీటిని టెలిగ్రాఫ్ అధికారికి వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను) ప్రతిపాదిత పనులు లేక మార్పుల అవసరము ఏర్పడినట్లయితే అనుమతిదారుడు వీలైనంతవరకూ అట్టి నోటీసును మాత్రమే ఈయవలసి యుండును.

(2) ఏదేని సర్వీసు లైను వేయుటకొరకు పనులను చేయవలసియున్నప్పుడు, అనుమతిదారుడు, అట్టి పనులను ప్రారంభించుటకు కనీసం 48 గంటలకు ముందు, అట్టి పనులను చేపట్టు తన ఉద్దేశమును వ్రాతపూర్వకంగా తెలుపుతూ టెలిగ్రాఫ్ అధికారికి నోటీసును అందజేయవలెను.

××× ××× ×××

**164. కొన్ని సందర్భములలో టెలిగ్రాఫు అధికారి యొక్క అధికారములను వినియోగించుట:**

విద్యుత్ ప్రసారణ కొరకు విద్యుత్ లైన్లను లేక విద్యుత్ ప్లాంటును ఏర్పాటుచేయు నిమిత్తము లేక పనులను చేయుటలో తగువిధమైన సమన్వయము కొరకు టెలిఫోను లేక టెలిగ్రాము ద్వారా అవసరమైన సమాచారమును పంపు నిమిత్తము, ప్రభుత్వముచే స్థాపించబడిన లేక నిర్వహించబడుచున్న లేక స్థాపించబోవు లేక నిర్వహించబోవు టెలిగ్రాఫ్ వ్యవస్థ విషయంలో టెలిగ్రాఫ్ లైన్లు మరియు స్తంభములు వేయుటకొరకు భారత టెలిగ్రాఫ్ చట్టము, 1885 ప్రకారం టెలిగ్రాఫ్ అధికారికి ఉన్న అధికారములను, సంబంధిత ప్రభుత్వము వ్రాతపూర్వకమైన ఉత్తరువు ద్వారా, ఎవరేని ప్రభుత్వ అధికారికి, అనుమతిదారునికి లేక ఈ చట్టము ప్రకారం విద్యుత్ సరఫరా వ్యాపారము చేయుచున్న ఎవరేని వ్యక్తికి ఒసగవచ్చును. ఈ అధికారములు, సంబంధిత ప్రభుత్వము సబబని భావించి విధించునట్టి షరతులు మరియు పరిమితులకు మరియు భారత టెలిగ్రాఫ్ చట్టము, 1885 (1885 లో 13వ చట్టము) లోని నిబంధనలకు లోబడి యుండవలెను.

××× ××× ×××

**<u>గమనిక:</u>** నియమాల యొక్క ఈ తెలుగు అనువాదము ప్రజాసౌకర్యం నిమిత్తం చేసిన స్వేచ్ఛానువాదము మాత్రమే. అధికారిక పాఠం కాదు.